క్లుప్తంగా

ఫార్మసీ ఆఫీసర్లుగా పరిగణించాలి



ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసిన ఫార్మసీ ఆఫీసర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేసే ఫార్మాసిస్టులను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఫార్మసీ ఆఫీసర్లుగా పరిగణించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డిని ఏపీ ఫార్మసిస్టు అసోసియేషన్ నాయకులు కోరారు. రాష్ట్రంలోని ఫార్మాసిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ అధ్యోగులు కె. రంగస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం. రాజేష్ నాయక్, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ బి. నరసింహారావు, బీకేఎం శర్మ, శ్రీనివాస్, వెంకటేష్, దీప్తి తదితరులు ఉన్నారు.

సీఏఏ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): తక్షణమే సీఏఏ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో సీఏఏ చట్టం అమలును నిలపాలని కోరుతూ జమ్మిచెట్టు నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలోని ముస్లింల మనోభావాలను దెబ్బతీసేందుకు మోదీ సీఏఏ చట్టాన్ని తెచ్చారన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ఈ చట్టాన్ని అమల్లోకి తేవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాజశేఖర్, ఆనంద్‌బాబు, అబ్దుల్లా, రంగప్ప, సుభాన్, షరీఫ్, రామకృష్ణ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): వాల్మీకులకు ఎస్‌టీ హోదా కల్పించడం వల్ల కలిగే ప్రయోజనాలకు సంబంధించి దక్షిణ భారత శ్రీ మహర్షి వాల్మీకి ట్రస్ట్ (బెంగళూరు) ముద్రించిన క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక డా.భవానీ ప్రసాద్ క్లీనిక్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా. భవానీ ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, బెంగళూరుకు చెందిన నాయకులు రంగనాయకులు, వాల్మీకి/ బోయ సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు కుబేరస్వామి, అధ్యక్షుడు తలారి కృష్ణనాయుడు, ఉపాధ్యక్షుడు బేతం కృష్ణుడు, కోశాధికారి మండ్ల శేఖర్, నాయకులు విష్ణు, రవిశంకర్‌నాయుడు, సునీల్, శంకర్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

చూపును తినేస్తోంది!

- ఏటా పెరుగుతున్న గ్లకోమా బాధితులు
- ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో ప్రతి సంవత్సరం 2వేల మందికి చికిత్స
- 40 ఏళ్లు పైబడిన వారిలో వ్యాధి లక్షణాలు
- బీపీ, షుగర్, స్టెరాయిడ్ మందుల వాడకంతో సమస్య
- గ్లకోమా అవగాహన వారోత్సవాల సందర్భంగా

అంత వరకు అందంగా కనిపించిన ప్రపంచం ఒక్కసారిగా అంధకారంగా మారిపోతే.. రాత్రివేళల్లో కరెంటు పోయినట్లుగా అంతా చీకటిగా అగుపిస్తే ఎంత నరకమో కదూ. గ్లకోమా సైతం ఉన్న ఫలంగా ఇలాగే దృష్టిని తినేస్తుంది. చాపకింద నీరులా విస్తరించే ఈ వ్యాధిని ముందుగా గుర్తించి చికిత్స తీసుకుంటే చూపు మిగులుతుంది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు గ్లకోమా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల, నంద్యాల కంటి ఆసుపత్రితో పాటు 11 విజన్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో చికిత్స కోసం వచ్చే వారిలో గతంలో 3 శాతం వరకు గ్లకోమా బాధితులు ఉండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 5 నుంచి 10 శాతం వరకు ఉంటోంది. ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో ప్రతిరోజూ 250 నుంచి 300 మంది దాకా చికిత్స కోసం వస్తుంటారు. వీరిలో రోజుకు కనీసం 10 నుంచి 20 మంది గ్లకోమా బాధితులు ఉంటున్నారు. ఈ ఆసుపత్రిలో గత ఐదేళ్లలో పదివేల మందికి గ్లకోమా చికిత్స చేశారు. వీరితో పాటు ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో మరో వెయ్యి మందికి పైగా చికిత్స తీసుకున్నట్లు అంచనా. ఈ మేరకు గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ప్రాంతీయ కంటి వైద్యశాలలో ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నారు. చికిత్స కోసం వచ్చిన వారికి గ్లకోమాపై వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు. గ్లకోమాకు నీటికాసులు, నల్లముత్యం, కాలామోతి అని కూడా అంటారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

35 నుంచి 40 ఏళ్ల వయస్సులో గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలి. ముఖ్యంగా కళ్లకు దెబ్బలు తగిలిన వారు, హ్రస్వదృష్టి కలిగిన వారు, స్టెరాయిడ్స్ మందులు వాడే వారు, మధుమేహం, బీపీ ఉన్న వారు, కుటుంబంలో ఎవరికైనా గ్లకోమా ఉంటే దగ్గరి బంధువులు అప్రమత్తంగా ఉండటం అవసరం.



పెద్దాసుపత్రిలో కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యురాలు

ప్రాథమిక దశలో గ్లకోమా లక్షణాలు

- 40 ఏళ్లు పైబడి వారు తరచూ అద్దాలు మార్చాల్సి రావడం
- మసక వెలుతురులో వస్తువులను గుర్తించడం ఆలస్యమవడం
- క్షేత్రదృష్టిని క్రమేణా కోల్పోవడం
- కంటి ఎరుపు, నీళ్లు కారడం, కంటినొప్పి, దృష్టి మందగించడం, వాంతులు లాంటి లక్షణాలు కూడా కొంత మందిలో కనిపించవచ్చు
- లైట్ల చుట్టూ రంగుల వలయాలు కనిపించడం

గ్లకోమా నిర్ధారణ

- గ్లకోమా నిర్ధారణకు ఈ కింది సమగ్ర కంటి పరీక్షలు వివరంగా చేయడం తప్పనిసరి
- అక్షర పటం చదివే సాధారణ కంటి పరీక్ష
- స్లిట్ ల్యాంప్ (మైక్రోస్కోప్) పరీక్ష. ఈ స్లిట్ ల్యాంప్ కంటి వైద్యునికి స్టెతస్కోప్ వంటిది. కంటి పరీక్షల్లో అందరికీ ఇది తప్పనిసరి.
- అప్లనేషన్ టోనోమీటర్ అనే పరికరంతో కొలుస్తారు. అప్పుడప్పుడు వేర్వేరు సమయాల్లో ఒత్తిడిని పరీక్షించాల్సిన అవసరం రావచ్చు.
- గ్లకోమా ఏ రకమో నిర్ధారించడానికి కంటి కోణాన్ని గొనియోస్కోప్ అనే పరికరంతో పరీక్షిస్తారు.
- కంటిలో మందు చుక్కలు వేసి నేత్ర బింబాన్ని కంటి వెనుక భాగాన్ని రెటీనాను పరీక్షించడం కూడా చాలా అవసరం. నేత్రబింబాన్ని కంప్యూటర్ స్కాన్ కూడా చేయవచ్చు.
- వ్యాధి నిర్ధారణ చేయడానికి మీ డాక్టర్ ఆటోమేటెడ్ ఫీల్డ్ లేదా పెరిమెట్రి పరీక్ష నిర్వహిస్తారు.
- తొలిదశలో గ్లకోమాను కేవలం గుర్తించగలుగుతారు లేదా ఆటోమేటెడ్ పెరిమెట్రి పరీక్ష ఉపయోగించడం ద్వారా పర్యవేక్షిస్తారు.

చికిత్స మార్గాలు

గ్లకోమాకు శాశ్వత చికిత్స లేదు. చికిత్స ద్వారా మిగిలిన చూపును కాపాడవచ్చు. అందుకనే ఈ వ్యాధిని తొలి దశలో గుర్తించడం చాలా ముఖ్యం. కొందరి రోగుల్లో గ్లకోమాను కేవలం మందులతో అదుపు చేయవచ్చు. మరికొందరికి లేజర్ చికిత్స లేదా శస్త్ర చికిత్స అవసరం కావచ్చు. సాధారణ అంగిల్ క్లోజర్ గ్లకోమా చికిత్సలో డాక్టర్ లేజర్‌ను ఉపయోగించి ద్రవం ప్రవహించడానికి మరోమార్గం తయారు చేస్తారు. కానీ బాగా ముదిరిన దశలో రోగిని మందులు శస్త్రచికిత్సల అవసరం ఉంటుంది. ఈ అంగిల్ క్లోజర్ గ్లకోమా వచ్చినప్పుడు కంటి నరానికి నష్టం జరగకుండా ఒత్తిడిని సాధ్యమైనంత త్వరగా తగ్గించాలి. ఓపెన్ అంగిల్ గ్లకమోను ఒత్తిడిని తగ్గించేందుకు ముందుగా కంటిలో మందు చుక్కలు వేస్తారు. వ్యాధి ముదిరినప్పుడు సాధారణ చికిత్స పని చేయకపోతే శస్త్రచికిత్స చేయాల్సి రావచ్చు. గ్లకోమాను జీవితాంతం పర్యవేక్షించాల్సి ఉంటుంది. పరీక్ష ఎంత తరచుగా చేయాలనేది వ్యాధి దశపై ఆధారపడి ఉంటుంది. మీ వ్యాధి దశను బట్టి మీకు చుక్కల మందు అవసరమా లేదా లేజర్ చికిత్స అవసరమా లేదా శస్త్రచికిత్స అవసరమా అనేది మీ డాక్టర్ సలహా ఇస్తారు. వచ్చిన ప్రతిసారి వ్యాధి ఎంత పెరిగిందో నిర్ధారించేందుకు చికిత్సలో మార్పులు చేయడానికి కొన్ని పరీక్షలు చేయాల్సి రావచ్చు.

ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేయకూడదు



గ్లకోమాకు శాశ్వత చికిత్స లేదు. అయితే చికిత్స ద్వారా ఇక మిగిలిన చూపును మాత్రమే కాపాడవచ్చు. గ్లకోమాకు కంటి ఆసుపత్రిలో ప్రతిరోజూ ప్రత్యేకమైన పరీక్షలు నిర్వహిస్తున్నాము. వ్యాధినిర్ధారణ అయిన వారిలో కొందరికి కేవలం మందులతోనే అదుపు చేయవచ్చు. మరికొందరికి లేజర్ చికిత్స, శస్త్రచికిత్స అవసరం కావచ్చు. బీపీ, షుగర్ ఉంటే నియంత్రణలో ఉంచుకోవాలి. కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా తరచూ గ్లకోమా పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది.

–డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల, కర్నూలు

అవగాహన కార్యక్రమాలు



గ్లకోమాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహించాము. ఇందులో భాగంగా 10వ తేదీన నగరంలో ర్యాలీ నిర్వహించాము. 11, 12వ తేదీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో వైద్య పరీక్షలతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాము. 13వ తేదీన పీజీలకు సెమినార్ ఏర్పాటు చేశాము. మిగిలిన రోజుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ప్రజలు గ్లకోమాను నిర్లక్ష్యం చేయకుండా తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలి.

–డాక్టర్ సంధ్యారెడ్డి, జిల్లా అంధత్వ నివారణాధికారి, కర్నూలు

సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



సూర్యనారాయణ స్వామి మూల విరాట్‌కు హారతి ఇస్తున్న అర్చకుడు

కర్నూలు కల్చరల్: మీన సంక్రమణ పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్‌కు అరుణ, మహా నారాయణ,సున్నాలపన్న పారాయణంతో సుగంధ ద్రవ్య జలాభిషేకం చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తర్వాత వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

టీజీ భరత్ బెదిరిస్తున్నాడు

- అధికారులు స్పందించి న్యాయం చేయాలి
- కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగిన మామిదాలపాడుకు చెందిన బాదరయ్య కుటుంబసభ్యులు



కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగిన బాదరయ్య కుటుంబం

కర్నూలు(సెంట్రల్):ఆక్రమించుకున్న తమ భూమిని తిరిగి ఇవ్వాలని కోరేందుకు వెళ్లిన తమను మెట్లు ఎక్కితే మెట్టుతో కొడతానని కర్నూలు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ బెదిరిస్తున్నాడని మామిదాలపాడుకు చెందిన దళిత బాదరయ్య కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నోటికి వచ్చినట్లు తీవ్ర అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, తమ కుటుంబానికి ఏమైనా జరిగితే టీజీ వెంకటేష్, టీజీ భరత్‌లదే బాధ్యత అని బాదరయ్య కుమారులు సత్యం, రాజు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట టీజీ భరత్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న తమ భూమిని తమకు ఇప్పించాలని కోరుతూ బాదరయ్య కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..టీజీ భరత్ తమ తండ్రి ప్రమేయం లేకుండా రూ.4.5 కోట్లు విలువ చేసే 33 సెంట్ల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. తమ భూమిని తమకు ఇవ్వాలని కోరితే ఎస్సీ కేసు పెట్టించి పోలీసులతో వేధింపులకు గురి చేయిస్తున్నారని వాపోయారు. జరిగిన అన్యాయంపై స్పందనలో అర్జీ ఇచ్చినా న్యాయం జరగలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

చౌడేశ్వరిదేవి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

కల్లూరు: మండల కేంద్రంలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి దేవదాయశాఖ రూ.1.25 కోట్లు కేటాయించినట్లు ఈఓ గుర్రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాగలక్ష్మయ్య, కార్పొరేటర్లు నరసింహులు, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, అరుణ, శ్వేతారెడ్డి, నాయకులు రంగప్ప, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

- మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- నగరంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీతోనే నగరంలో అభివృద్ధి సాధ్యమవుతోందని మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ ఉల్చాల రోడ్డులోని వై జంక్షన్, 36వ వార్డులోని గోపీనగర్, రహీమ్‌నగర్‌లలో సుమారు కోటి రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి మేయర్, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరై అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించి మాట్లాడారు. నగరంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు బయటకు వస్తున్నారన్నారు. అయితే, వారు చెప్పే మాయమాటలు, అబద్ధాలను నమ్మి మోసపోవదని సూచించారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు గల తేడాను గమనించాలన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ నాయకుడు చంద్రబాబు 600పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని పట్టించుకోలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

ప్రతి గడపకు లబ్ధి చేకూరింది

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రతి గడపకు లబ్ధి చేకూరిందని మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని అన్నారు. కులమతాలు, వర్గాలు, పార్టీలు చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వైఎస్ జగన్ సర్కారు సంక్షేమ ఫలాలు అందజేసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోయినా కరోనా సమయంలో తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, బీసీ విభాగం నాయకులు ధనుంజయ ఆచారి, క్లస్టర్–1 అధ్యక్షుడు భీమా శంకర్ రెడ్డి, కార్పొరేటర్లు, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

30 పోలీసు యాక్ట్ అమలు

కర్నూలు(సెంట్రల్): రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 30 పోలీసు యాక్ట్‌ను అమల్లో ఉంచినట్లు కర్నూలు డీఎస్పీ కె.విజయశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు ఈ యాక్ట్ అమల్లో ఉండటంతో ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ఆందోళలు నిర్వహించడానికి వీలు ఉండదన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



పోలీసు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. ప్రజలకు అండగా ఉండేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని, ప్రతి ఒక్కరూ నిష్పక్షపాత పోలింగ్‌కు సహకరించాలన్నారు. శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన సాయుధ బలగాల కవాతు వివరాలను ఆయన తన కార్యాలయంలో వివరించారు. ఆదోని, పత్తికొండ సబ్ డివిజన్లలో కేంద్ర బలగాల ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించినట్లు చెప్పారు. కోడుమూరు మండలం కోడుమూరు, ప్యాలకుర్తి, పెద్దతుంబళం పీఎస్ పరిధిలోని జి.హోసలి, కడితోట, కృష్ణగిరి పోలీసు స్టేషన్ పరిధిలో చిట్యాల, సీహెచ్ ఎర్రగుడి, కంబాలపాడులలో పోలీసు కవాతు నిర్వహించినట్లు వెల్లడించారు.

సురక్ష.. పేదల ఆరోగ్యానికి రక్ష

ఓర్వకల్లు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఓర్వకల్లు మండలంలోని నన్నూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు పరీక్షలు నిర్వహించి, అందుకు అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు.

కబడ్డీ విజేతలకు బహుమతులు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో హజరత్ సయ్యద్ సుల్తాన్ మమూద్‌షా ఖాద్రి ఉరుసు సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 16 జట్లు పాల్గొన్నాయి. ప్యాపిలి జట్టు తొలి స్థానంలో నిలిచి రూ.15 వేలను అందుకుంది. రెండో స్థానంలో శకునాల జట్టు రూ.10 వేలు, మూడో స్థానంలో ఓర్వకల్లు జట్టు రూ.5 వేలు, నాల్గో స్థానంలో కాల్వబుగ్గ జట్టు రూ.3 వేల చొప్పున బహుమతులు అందుకున్నాయి.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలి

కర్నూలు (టౌన్): 137 కర్నూలు నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలన్నింటిలో ముందస్తుగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. శుక్రవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కర్నూలు నియోజకవర్గ పరిధిలో శానిటేషన్ పనులు ముమ్మరం చేయాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి ఫిర్యాదులు రాకూడదని చెప్పారు. ప్రతి శానిటేషన్ డివిజన్ పరిధిలో యూజర్‌చార్జీలు, ట్రేడ్ లైసెన్సుల పురోగతిని కమిషనర్ సమీక్షించారు. సమావేశంలో మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, కార్పొరేషన్ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 81 క్యూసెక్కుల నీరు

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శుక్రవారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన ట్లు డ్యాం అధికారులు తెలిపా రు. డ్యాంలో కేవలం 0.089 టీఎంసీల నీరు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఒక అవకాశం ఇవ్వండి

- నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తా
- కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్
- 51వ వార్డులో రూ.50 లక్షలతో సీసీ కాల్వల పనులకు శంకు స్థాపన



ఈసీఎం కాంపౌండ్‌లో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్

కర్నూలు (టౌన్) : రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా ఒక అవకాశమిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు నియోజకవర్గ సమన్వయ కర్త ఇంతియజ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక 51 వ వార్డు పరిధిలోని ఈసీఎం కాంపౌండ్ వద్ద రూ.50 లక్షలతో చేపట్టే సీసీ కాల్వల పనుల శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బీవై రామయ్య పాల్గొన్నారు. కర్నూలు నియోజకవర్గ సమన్వయ కర్త ఇంతియాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన విధానాలు నచ్చి వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీలో చేరానన్నారు. ప్రతి పేదవాడు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్న ముఖ్యమంత్రి తపన తనను ఆకర్షించిందన్నారు. దీంతో తాను ఐఏఎస్ పదవికి రాజీనామ చేసి పార్టీలో చేరానన్నారు. కర్నూలు నగరంలో పుట్టి పెరగడంతో పాటు ఇక్కడే చదివాను అని అన్నారు. 30 సంవత్సరాల పాలనా అనుభవం ఉందని, సార్వత్రిక ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లు షేక్ మహమ్మద్, విక్రమసింహారెడ్డి, వైఎస్‌ఆర్‌టీయూసీ నాయకులు రమణ, పార్టీ నాయకులు తిరుమలేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంతియాజ్‌ను కలిసిన వీఆర్‌ఓ అసోసియేషన్ నాయకులు

వీఆర్‌ఓలకు చెందిన అసోసియేషన్ నాయకులు శుక్రవారం కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్‌ను కలిశారు. ఇటీవల తమకు గ్రేడ్–2 గుర్తింపు కల్పించాలని వీఆర్వోలు ఆయనను కలిసి కోరారు. ఈ విషయాన్ని ఇంతియాజ్ వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి డిమాండ్‌ను పరిష్కరింపజేశారు. ఈ నేపథ్యంలో వీఆర్వోలు సంతోషం వ్యక్తం చేస్తూ ఇంతియాజ్‌ను సత్కరించారు.

ప్రభుత్వ విద్య బలోపేతం

గతంతో పోల్చితే ప్రభుత్వ విద్య ఎంతో బలోపేతమైందని కర్నూలు నియోజకవర్గ సమన్వయ కర్త ఇంతియాజ్ అన్నారు. శుక్రవారం ఆయన పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. ఉన్నత చదువులు చదువుకోలేని వారికి జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్య ద్వారా సాయం అందజేస్తుందన్నారు. ప్రస్తుతం నగరంలో మున్సిపల్ స్కూళ్ల రూపురేఖలు మారిపోయాయన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి పాఠశాలలో ఇంగ్లీషు మీడియాన్ని వైఎస్ జగన్ సర్కారు ప్రవేశపెట్టిందన్నారు. సీఎం జగన్ పాలన నచ్చి ఐఏఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లో వచ్చిన తనను వచ్చే ఎన్నికల్లో అండగా నిలబడాలని ఈ సందర్భంగా కోరారు.

ఇంటింటికి వెళ్లి..ఆప్యాయంగా పలకరించి



ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు వివరిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ సమన్వయకర్త ఇంతియాజ్

నగరపాలక సంస్థ పరిధిలోని 42వ వార్డులో శుక్రవారం వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి..ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు–అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను వారికి అందజేశారు. వచ్చే ఎన్నికల్లో తనకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జగనన్న సచివాలయాల జిల్లా కో–ఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ శ్వేతా రెడ్డి, తిరుమలేశ్వర రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

కాన్షీరామ్ ఆశయ సాధనకు కృషి

కర్నూలు (న్యూటౌన్): నీతి నిజాయితీకి ఆత్మ గౌరవానికి నిలువెత్తు నిదర్శనమైన కాన్షీరామ్ ఆశయ సాధనకు కృషి చేస్తామని మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం బీ క్యాంప్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్య వేదిక కార్యాలయంలో కాన్షీరామ్ 90వ జయంతి కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ ఆధ్వర్యంలో మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, బీసీ సంఘం నాయకులు శేషఫణి, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు శేషు కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం అని, ఆ దిశగా బహుజనులందరూ ఏకమవ్వడం ప్రధాన కర్తవ్యమని కాన్షీరామ్ సూచించారన్నారు. మహిళల పక్షపాతి, దళిత మహిళను ముఖ్యమంత్రిని చేసిన ఘనత కాన్షీరామ్‌దేనని కొనియాడారు.

రేపు సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు(సెంట్రల్): భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 17వ తేదీన సీఆర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు పి.రామచంద్రయ్య హాజరవుతారన్నారు..